
కథ

# మాయ.సెలుమాయ

దోనె నాగేశ్వరరావు

ప్రసన్న రామారావుకి ప్రమోషన్ వచ్చింది. దాంతో ఎమోషనూ వచ్చింది. తన కొలీగ్స్‌కి ఓ మందుపార్టీ ఏర్పాటుచేశాడు. పార్టీ పరిపక్వదశకు చేరుకున్న తర్వాత కొందరు గడుగ్గాయిలు పొగడ్తలు కురిపించారు.

కొందరు వీరాభిమానులు ‘‘బాసూ! నీకు హోదా పెరిగింది. ఆదాయమూ పెరిగింది. కానీ స్టేటస్ సింబల్ సెల్‌ఫోన్ లేకపోతే ఎలా?’’ అంటూ అభిమానంతో మందలించారు. పనిలో పనిగా ‘సెల్లు లేనివాడు చిల్లిగవ్వకి చెల్లడు’ అనీ, ‘బిల్లులందు సెల్లు బిల్లులు వేరయా’ అనీ, ‘పిల్లలందుకూడ సెల్లు చిన్నెలు చూడయా’ అనీ తలో పక్కనా తగులుకుని కవితాత్మకంగా, కైపాత్మకంగా పిచ్చిపిచ్చిగా రెచ్చగొట్టేశారు.



ఇంతింతై వటుడింతై అన్నట్టు ప్రసన్న లోలోన ఉప్పొంగిపోయి యుద్ధ ప్రాతిపదికన సెల్‌ఫోన్ కొనేశాడు. అప్పట్నుంచి మొదలయ్యాయి వింత వింత కష్టాలూ, ఇంతలింతల ఖర్చులూ. కొత్తలో కొనియాడిన కొలీగ్స్ రానురానూ లౌక్యంగా మిస్‌డ్ కాల్స్ చేసి సోది చెప్పి వాళ్లపనులు చేయించు కుంటూ ఫోను బిల్లును పెంచేస్తున్నారు. కొంద రైతే ల్యాండ్‌ఫోన్ నుంచి కూడా మిస్‌డ్ కాల్స్ ఇచ్చేస్తున్నారు. దాంతో ప్రసన్న నెలకి రెండుమూడుసార్లు కార్డులు వేసుకోవాల్సి వస్తోంది. క్రమక్రమంగా జ్ఞానోదయం కలిగి మిస్‌డ్ కాల్స్‌ని పట్టించుకోవడం మానేశాడు.

నిన్నటి అర్ధరాత్రివేళ ఓ మిస్‌డ్ కాల్ వచ్చింది. ''వేళాకోళానికి వేళాపాళా లేదా?'' అని విసుక్కుని నెంబర్ చూసి పక్కన పడేశాడు. వెంటనే మరోసారి రింగైంది. ఎంతకూ ఆగకపోతే మిస్‌డ్ కాల్ కాదులెమ్మని ధైర్యంగా లిఫ్ట్ చేసి ''హలో!'' అన్నాడు.

''ఏం బాబూ! అప్పుడే టెంకముదిరిందా?'' అన్న అధికారదర్పంతో కూడిన కంఠస్వరం విని తుళ్లిపడ్డాడు ప్రసన్న. ''సార్! సారీసర్! గుడ్‌మార్నింగ్ సర్! సారీ... గుడ్‌నైట్‌సార్....ఛఛ... గుడ్ ఈవినింగ్ సార్'' అంటూ కంగారుగా ప్రాధేయపడ్డాడు.

''ఏం! నిద్రపోతున్నావా?'' హూంకరించి ఉరిమాడు బాసు.

''ఛఛ... లేదుసార్! అర్ధరాత్రి నిద్రేమిటి సార్...అంటే ఆ నెంబర్ మీది కాదు గదా...అని.. '' నసిగాడు ప్రసన్న.

''ఓకే. నో ప్రాబ్లెం. నేనొక ఫ్రెండింట్లో పార్టీకొచ్చాన్లే. ఇది ఆ నెంబరే. సరే ఇప్పుడే మన ఎం.డి గారు ఫోన్ చేశారు. రేపు మధ్యాహ్నం రెండింటికి విజయవాడలో మన బ్రాంచ్ ఆఫీస్‌లో పార్టీ ఉందట.. సారీ... మీటింగ్ ఉందటయ్యా! నువ్వు ఎప్పుడు బయల్దేరతావో నాకనవసరం. నువ్వా మీటింగ్‌కి అటెండవ్వాలి. మిస్సయితే బాగుండదు. జరగబోయే నష్టానికి నువ్వే బాధ్యత వహించవలసి ఉంటుంది. సరేనా? ఇక పడుకో... మిస్‌డ్‌కాల్స్‌ని పట్టించుకోకపోయినా ఫర్వాలేదుగానీ ఉద్యోగ బాధ్యతలు పట్టించుకో'' అంటూ ఓ చురకంటించి వదిలాడు.

భయపడిపోయాడు ప్రసన్న. ''బాస్ మిస్‌డ్ కాల్స్ చేస్తే పట్టించుకోలేదన కోపమొచ్చినట్టుంది. అసలు నిజంగా రేపు విజయవాడలో మీటింగుందా? లేక పార్టీ తలకెక్కి నన్నేడిపించాలని ఈ పని నాకు పురమాయించాడా?'' అన తెగ ఆలోచిస్తూ నిద్రపోలేదు.

తనతో పాటు అతని భార్య అభేరికూడా తోడుగా జాగారం చేసింది. ఏది ఏమైనా వెళ్లక తప్పదని తీర్మానించుకున్నాడు.

ప్రసన్న పరుగులాంటి నడకతో బస్టాండ్‌కి చేరాడు. విజయవాడ బస్సు కోసం వెతికాడు. కంగారుతో తనకాలు తనే తొక్కుకుని తుళ్లిపడి పక్కవాళ్ల కాళ్లు కూడా తొక్కేసి సారీ చెప్పేస్తున్నాడు. చివరకి ఎంక్వయిరీ అడిగాడు ''సారీ. ఇప్పుడే వెళ్లింద. మరో అరగంటలో మరో బస్సుంది'' అని చెప్పారు.

''ఆహాహా....అర్జెంట్‌కి ఆలస్యం మొగుడంటారు ఇందుకేనేమో. ఎంత ప్రయత్నించినా లేటుగా నిద్రపట్టి లేటుగా మెలకువ వచ్చింది. టైంకి విజయవాడ వెళ్లలేకపోతే అసలే దూర్వాసుడి తమ్ముడులాంటి బాసు రెచ్చిపోయి ఉగ్రనరసింహుడవుతాడు. ఇప్పుడెలా?''అనుకుంటూ అసహనంగా బల్లమీద చతికిలబడ్డాడు ప్రసన్న.

''ఎక్స్‌క్యూజ్‌మీ సార్!'' అన్న పలకరింపుతో ఉలిక్కిపడి చూశాడు. ఓ టీనేజ్ కుర్రాడు ఒక ఎర్ర రంగు ఎయిర్‌బ్యాగ్‌ని తన పక్కనుంచి'' ఇప్పుడే వచ్చేస్తాను సార్'' అంటూ చిరునవ్వులు చిందిస్తూ బయటికి వెళ్లాడు చరచరా.

అసలే అసహనంగా ఉన్న ప్రసన్నకి చిర్రెత్తుకొచ్చింది. ''అసలిలాంటి అతి తెలివిగాళ్లని తన్నక పోతేనే తప్పు. నవ్వొకటి వీడి మొహానికి.

'అరె! ఇప్పుడు బస్సొచ్చేస్తే నేను వెళ్లాలా? వీడి బోడిబ్యాగుక కాపలా కూర్చోవాలా? ఛఛ..' నుకుంటూండగానే అతను వచ్చేసి తన పక్కన కూర్చుంటూ, అదే చిరునవ్వు మెయిన్‌టైన్ చేస్తూ




''థ్యాంక్యూ సర్! మీక్కూడా ఏదైనా బాత్రూం పనుంటే వెళ్లిరండి సార్! మీ సామాన్లు నేను చూసుకుంటాను'' అన్నాడు.

అప్పటివరకూ బస్సు కోసం ఎదురుచూస్తూ ఆ విషయమే మర్చిపోయాడు ప్రసన్న. 'భలే... బాగా గుర్తుచేశాడు. చాలా మంచివాడులా ఉన్నాడు సుమా! మంచివాడు కాకపోతే మరి ముక్కూమొహమూ తెలియని నన్ను నమ్మి బ్యాగుని వదిలేసి వెళతాడా! దీన్నిబట్టి మనుషుల్లో ఇంకా నమ్మకం అనేది సజీవంగానే ఉందని నమ్మకంగా నమ్మొచ్చు'అని మనసులోనే అతన్ని మెచ్చుకుంటూ లేవబోయాడు.

ఇంతలో సెల్‌ఫోన్ రింగయింది. లిఫ్ట్ చేయకపోతే మళ్లీ ఏం కొంప మునుగుతుందో అనుకుంటూ కూర్చుని లిఫ్ట్‌చేశాడు''హలో!'' అంటూ.

అటువైపు కంఠస్వరం వింటూనే ప్రసన్న ముఖం ఆనందాశ్చర్యాలతో మెరిసింది. ఒళ్ళు మరిచినట్టు పెద్దగా ''హలో... ఎవరూ?... ఒరేయ్ శ్యామ్! నువ్వా! ఎన్నాళ్లకి గుర్తొచ్చాన్రా? అవునూ ఇదేదో లోకల్ నెంబర్ కదూ! నువ్వెక్కడున్నావ్? అవునా! ఎప్పుడొచ్చావురా! బావగారు కూడానా! అరె... హాస్పిటలా? ఏం? ఫ్రెండుకా? ఏ హాస్పిటలు? ఇప్పుడెలా ఉందిరా!... సరేలే. చెప్పు డబ్బా ఇప్పుడా? నేనిప్పుడూ విజయవాడ వెళుతున్నా. ఆల్‌రెడీ బస్టాండులో ఉన్నారా. రేపు వచ్చేస్తా ఆ? నిజమే మరెలా? పోనీ ఒక పనిచెయ్. నువ్వు ఆటోలో బయల్దేరి ఇంటికి రా. వెంటనే బయల్దేరితే గంటకి రాగలవు. మీ వదినకి ఫోన్ చేస్తా. ఒక ఇరవైవేలు రెడీ చేస్తుంది. మిగతాది ఒకరోజులో అంతకంటే ఎక్కువ తీయలేం. ఆ... ఈ పూట అంతవరకూ తీసుకెళ్లరా... ఒప్పు కుంటార్లే. ఆ! అడ్రసా! అవున్రా నువ్వెప్పుడూ రాలేదుగదూ! తిన్నగా నువ్వు గాంధీనగర్ బస్టాండ్‌కి వచ్చెయ్. అవును నేనిప్పుడు అక్కడ్నుంచే మాట్లాడుతున్నా. ఈ బస్టాండ్ ఎదురుగా గణేష్ హోటల్ ఉంది. ఆ... ఆ స్ట్రీట్‌లో ముందుకెళ్ళు. మధ్యలో రెండు అడ్డరోడ్లు వదిలేయ్. మూడో అడ్డరోడ్ దగ్గర దిగెయ్. కుడివైపున చివరి ఇల్లు. అక్కడ నా నేమ్‌ప్లేట్ కనిపిస్తుందిలే. లేదంటే ''ప్రసన్న ఇల్లేదీ?'' అని ఎవర్నైనా అడుగు.

మీ వదిన రెడీగా ఉంటుంది లేరా. ఆ? ఆ... అదీ నిజమేరోయ్. తను కొత్తగదా! మామూలుగా అయితే గుర్తుపట్టకపోవచ్చు. ఇప్పుడు నేను ముందే చెబుతానుగా. ఆ! ఫర్వాలేదులే. ఓకే... అదిగో బస్సొచ్చేసింది. మరి ఉండనా! ఓకే...'' పరిగెత్తుకెళ్లి ప్రసన్న బస్సెక్కేశాడు.

వాకిట్లో ఆటో ఆగిన శబ్దం విన అభేరి బయటకొచ్చి చూసింది. ఆటోలోంచి దిగుతున్న కుర్రాణ్ణి చూసి ''ఎవరోలే'' అనుకుంటూ తిరిగి ఇంట్లోకి వెళ్ళబోయింది. ''ఎక్స్‌క్యూజ్‌మీ! ప్రసన్న గారి ఇల్లు ఇదేనా?'' అంటూ అతను దగ్గరికి వచ్చాడు. అభేరి ఆశ్చర్యంగా చూస్తూ ''అవునండీ! నేనాయన భార్యనే... మీరెవరు?'' అంది.

అతను నవ్వుతూ ''అయ్యో వదినా! నేను. శ్యామ్‌ని. అన్నయ్య ఫోన్ చెయ్యలా?'' అన్నాడు చనువుగా.

అరక్షణంలో పరిస్థితిని అర్థం చేసుకుంది అభేరి. తను ఏమాత్రం తొణక్కుండా ముఖాన నవ్వు పులుముకుని ''అ...అన్నయ్య ఫోన్‌చేశారు. అయ్యయ్యో నువ్వా బాబూ! అంటే....నువ్వు రావడానికి ఇంకా టైం పడుతుందని.. అనుకుంటున్నాను. రాబాబూ! లోపలికి రా''అంటూ ఆహ్వానించింది.

అతను సోఫాలో కూర్చుంటూనే ''వదినా! డబ్బు రెడీనా! నేను త్వరగా వెళ్లాలి. హాస్పిటల్‌లో... అదన్నమాట'' అన్నాడు.

''అదీ... బాబూ... మీరీలోపు స్నానం చేసి టిఫిన్ చేస్తూ ఉండండి. ఎంత? ఇక్కడే దగ్గరేలే. వెళ్ళి తెచ్చేస్తాను''

''అయ్యో వదినా! ఇప్పుడేమీ వద్దు. నేనూ వస్తాను పదండి. చాలా అర్జెంట్''

''ఇంకా నయం. మీకు ఇడ్లీ అల్లం పచ్చడీ ఇష్టమని మీ అన్నయ్య చెప్పారు. రెడీ చేశాను. మీరు తనకుండా వెళితే మీ అన్నయ్య నన్ను కోప్పడతారు. స్నానం చెయ్యకపోతే పోన్లే. టిఫిన్ చెయ్యండి. నేను వెళ్ళొస్తాగా. ఇక్కడేలే.. కాకపోతే కొంచెం క్యూ ఉండొచ్చు. మీరు టిఫిన్ చేసేలోపు వచ్చేస్తాను'' అంటూ టిఫిన్ ప్లేటు ఇచ్చి గబగబా బయటకెళ్లింది.

అతను టిఫిన్ చేసేశాడు. ఆమె రాలేదు. ఓ సిగరెట్ వెలిగించి ఊదేశాడు.

ఆమె రాలేదు. సోఫాలో నడుం వాల్చి ఆమె తెచ్చే డబ్బుతో ఏమేమీ చెయ్యాలో పథకాలు వేశాడు.

ఆమె రాలేదు. 'ఇంతసేపా? దగ్గరేనంటే? ఎంత క్యూ ఉంటే మాత్రం? అసలు తెస్తుందా? కొంపదీసి అనుమానించలేదు గదా! నో... ఆ ఛాన్సేలేదు. నమ్మేసింది. ఓ మైగాడ్. నువ్వు రావడానికి టైం పడుతుందని అనుకున్నానంది కదూ? అప్పుడు నేనేం చెప్పాను. చెప్పలేదు... షార్ట్‌రూట్‌లో వచ్చానని... చెబుదామనుకున్నాను కానీ చెప్పలేదు' అనుకుంటూనే స్ప్రింగ్‌లా లేచాడు. అతని మనసు కీడును శంకించింది. గుండె ఝల్లుమంది.

ఇంతలో బయటేదో జీపు ఆగిన శబ్దం వినిపించింది. 'అనుకున్నంత అయిందా?' అనుకుంటూ బయటికి రాబోయాడు. ఎదురుగా పోలీసులు వచ్చేశారు. అతన్ని పట్టుకున్నారు.

''నువ్వా నాయనా! ఇక్కడ వెలిశావా? పద.... పోలీస్‌స్టేషన్‌లో సంబరం చేసుకుందాం'' అంటూ ఈడ్చుకెళ్లి జీపెక్కించారు. అక్కడే నిలబడిన అభేరి పోలీసులకి నమస్కరించింది.

''థ్యాంక్సమ్మా! చాలా తెలివిగా వీణ్ణి బురిడీ కొట్టించి మాకు పట్టించావు. నీకు మా డిపార్ట్‌మెంట్ మంచి బహుమతి ఇస్తుందమ్మా!'' అంటూ చుట్టూ చేరిన జనాన్ని తప్పించుకుని పోలీస్ జీప్ ముందుకి వెళ్లింది.

జరిగినదాన్ని గురించి అందరూ చర్చించుకుంటూ అభేరిని మెచ్చుకుంటూ ఉండగా మరో ఆటోవచ్చి ఆగింది. ఆటోలోంచి దిగుతున్న అమ్మాయిని చూసి అభేరి నవ్వుతూ ఎదురెళ్లింది.

''నమస్కారం వదినా! గుర్తుపట్టారా!''

''అయ్యో! ఎంతమాట! అందరూ బాగున్నారా?''

''ఆ... ఏమిటి పోలీస్ జీప్ వెళుతుంది. వీళ్ళు... ఏమిటిదంతా?'' అడిగింది ఆ అమ్మాయి.

''రండి. ఇంట్లో తీరిగ్గా చెప్పుకుందాం'' అంటూ ఇంట్లోకి తీసుకొచ్చింది అభేరి. ఆమె సోఫాలో కూర్చుంటూ ''ఏదో జరిగినట్టుందే.. కదూ!''అంది.

''తల్లీ! మీ అన్నగారి నిర్వాకం. మీరు ఫోన్‌చేసినప్పుడు మీగొంతు వినగానే ఆయన ఆనందంతో పెద్ద లౌడుస్పీకర్లా మాట్లాడి ఉంటారు. అది ఆ దొంగోడు విని శ్యామ్ అంటే ఎవరో అబ్బాయి అనుకుని వెంటనే బయల్దేరి వచ్చి–

''నేనే శ్యామ్‌ని'' అన్నాడు.

'వీడేదో మాయగాడులా ఉన్నాడని గ్రహించాను. వాడికి అనుమానం రాకుండా జాగ్రత్తపడి ఏటిఎంకి వెళ్ళొస్తానని నమ్మించి బయటికెళ్లి ముందు మీ అన్నగారికి ఫోన్ చేసి తర్వాత పోలీస్ స్టేషన్‌కి వెళ్లి విషయం చెప్పాను. వాళ్ళు వెంటనే వచ్చి వాణ్ణి లాక్కెళ్లారు. మీ అన్నయ్య విజయవాడ ప్రయాణం క్యాన్సిల్ అయింది. వచ్చేస్తారు'' చెప్పింది అభేరి.

''పెద్ద గండమే గడిచింది. అయితే వదినగారు గడసరే సుమా! వాడు మాయచేయబోతే మీరు పెనుమాయ చేశారు'' అని మెచ్చుకుంది శ్యామల.

''ఏడీ! శ్యామ్‌గాడు వచ్చాడా?'' ప్రసన్న వచ్చేశాడు.

''అయ్యా మహా ప్రభో! ఇదిగో మీ శ్యామ్‌గాడు. అయినా శ్యామలాంబని శ్యాముగాడని అబ్బాయిని పిలిచినట్టు పిలవడం ఏమిటి? బడాయి గాబోలు''

''ఓ యబ్బ! మా ఇంటికి ఇది చివరి ఆడపిల్ల. అందుకే చిన్నప్పట్నుంచీ అందరూ అలాగే పిలుస్తారులే. ఇదేంటీ? ఈ ఎర్రబ్యాగుని ఎక్కడో చూశానే!''

''అన్నయ్యా! బస్టాండులోనా?'' నవ్వుతూ అడిగింది.

''అవున్రా! ఓహో ఈ బ్యాగు దొంగగాడిదేనా? అమ్మ దొంగా. ఎంతో మంచోడిలా కన్పించాడ్రా. ఏదైనా అదృష్టవంతులం. నా ప్రయాణమూ ఆగింది. శ్యాముగాడు క్షేమం. డబ్బూ క్షేమం. దొంగా దొరికి పోయాడు. అభేరీ ఈజ్ ద గ్రేట్'' అందరూ హాయిగా నవ్వారు.

★